

ప్రజా న్యూస్

— నెట్‌వర్క్ —

నిజం.. సమాజం.. ప్రజా కోసం.. || తెలుగు దినపత్రిక



తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 174,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,మంగళవారం , తేదీ : 27-10-2026

అర్ణబ్' తుపానుపై వదంతులు నమ్మొద్దు.. అప్రమత్తతో గండం నుంచి బయటపడదాం



బంగాళాఖాతంలో 'అర్ణబ్' తుపాను

రేపటికి అతి తీవ్ర తుపానుగా మారనున్న వైనం

అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం

ఏపీ, దక్షిణ ఒడిశా తీరాలకు రెడ్ అలర్ట్ జారీ

గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం

రైతులు, మత్స్యకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచన

అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలన్న మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం నేడు తుపానుగా మారింది. ఈ తుపానుకు 'అర్ణబ్' అని నామకరణం చేశారు. 'అర్ణబ్' తుపాను ఏపీ దిశగా వస్తోందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మిగతా..2లో

హైదరాబాద్‌లో డ్రగ్స్‌పై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం



హైదరాబాద్‌లో గంజాయి విక్రయాలపై ఈగల్ ఫోర్స్ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు జరిపారు. ఈ తనిఖీల్లో ఎల్‌బీఎస్ నగర్‌లో ఇంటి నుంచే గంజాయి విక్రయిస్తున్న 75 ఏళ్ల షేక్ జాతెన్ బీ అరెస్ట్ చేశారు.

హైదరాబాద్, అక్టోబరు 26 : హైదరాబాద్‌లో గంజాయి విక్రయాలపై ఈగల్ ఫోర్స్ అధికారులు ఈరోజు (సోమవారం) ఆకస్మిక దాడులు జరిపారు. ఈ తనిఖీల్లో ఎల్‌బీఎస్ నగర్‌లో ఇంటి నుంచే గంజాయి విక్రయిస్తున్న 75 ఏళ్ల షేక్ జాతెన్ బీని అరెస్ట్ చేశారు. నిందితురాలి ఇంట్లో 41 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆమె దగ్గరి నుంచి మొత్తం 179.1 గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. మిగతా..2లో

290 కోట్లు దాటిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు.. రేవంత్ రెడ్డి స్పందన



- మహాలక్ష్మి పథకంతో మహిళలకు రూ.10,000 కోట్ల ఆదా
- రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు వినియోగించుకుంటున్న పథకం
- ఈ పథకం మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అన్న సీఎం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ఓ కీలక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు ఇప్పటివరకు ఏకంగా రూ.10,000 కోట్లకు పైగా ఆదా చేసుకున్నారని టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. పథకం ప్రారంభమైన నాటి నుంచి సుమారు 28 నెలల్లో 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు.

తుమ్మిడిహెట్టిపై గుడ్‌న్యూస్.. తెలంగాణ ప్రతిపాదనకు ఫడ్నవీస్ సానుకూలం!

- తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపుపై ఫడ్నవీస్ సానుకూలం
- 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రతిపాదన
- అధ్యయనానికి అధికారుల కమిటీ ప్రతిపాదన
- రెండు లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- ముంపు భూములకు పరిహారం చెల్లిస్తామని హామీ



హైదరాబాద్: తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల సాగునీటి కల నెరవేరే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. ఎత్తు పెంపుతో మహారాష్ట్రకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండకూడదని స్పష్టం చేస్తూనే.. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. అయితే, బ్యారేజీ ఎత్తు పెంపుపై తుది నిర్ణయం తీసుకునే ముందు అన్ని అంశాలపై సమగ్ర అధ్యయనం చేయాల్సి ఉందని అన్నారు. ముంబైలోని సహ్యాద్రి రాష్ట్ర అతిథిగృహంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం ఫడ్నవీస్‌తో సోమవారం సమావేశమైంది. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం బ్యారేజీ ఎత్తు 148 మీటర్లుగా ఉంది. అయితే, ఆ ఎత్తుతో ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సాధ్యం కాదని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. మిగతా..2లో

హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర..



కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!

- నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర
- అమిత్ షా పాల్గొంటారని రామచందర్‌రావు ప్రకటన
- నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ర్యాలీ
- ఎస్ఐఆర్‌పై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం
- ఓటర్ల పేర్ల తొలగింపుపై రేవంత్‌రెడ్డికి బీజేపీ నేత సవాల్

హైదరాబాద్: తెలంగాణలో ఓట్ల తొలగింపు అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది.

ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన రాంచందర్ రావు



- ప్రధాని తండ్రిని ఉద్దేశించి ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు
- అధికారానికి దూరమవడంతో కాంగ్రెస్‌లో అసహనం అని వ్యాఖ్య

ఢిల్లీ: ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

క్రిమినల్స్ నడిపే పార్టీ బీజేపీ'- రాహుల్ కేసులో కోర్టు తీర్పును స్వాగతించిన కాంగ్రెస్

పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సుల్తాన్‌పుర్ ప్రత్యేక కోర్టు నిర్దోషిగా ప్రకటించగా, ఆ తీర్పును స్వాగతిస్తూ బీజేపీపై తీవ్ర విమర్శలు చేసింది హస్తం పార్టీ.



ఢిల్లీ : పరువు నష్టం కేసులో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఊరట లభించడంతో బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది కాంగ్రెస్. బీజేపీని నేరస్థులు నడిపే పార్టీగా అభివర్ణించింది. గాంధేయ మార్గంలో పోరాడి, ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఓడిస్తామని పేర్కొంది. బీజేపీ నేత అమిత్ షాపై 2018లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయనపై నమోదైన పరువు నష్టం కేసులో ఉత్తర్ ప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్ ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు నిర్దోషిగా సోమవారం ఉదయం ప్రకటించగా, ఆ తీర్పును కాంగ్రెస్ స్వాగతించింది. నిజం గెలిచిందని పేర్కొంది. బీజేపీ అధికారంలోకి రావడానికి నేరాలకు పాల్పడిన వారిని ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఆ పార్టీని ఓడించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అయితే ఆ పోరాటం హింసకు తావులేకుండా మహాత్మా గాంధీ చూపిన మార్గంలోనే సాగుతుందని చెప్పారు. ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఎదుర్కొంటామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 2018లో చేసిన వ్యాఖ్యల్లో పరువు నష్టం కలిగించే అంశం లేదని కోర్టు స్పష్టం చేసిందని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. అమిత్ షాను వ్యక్తిగతంగా మిగతా..2లో

96 గంటల్లో ఇరాన్‌పై భీకర దాడులకు యూఎస్ ప్లాన్ చేస్తోందా?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు అందిన 96 గంటల్లో, యూఎస్ సైనిక బలగాలు ఇరాన్ పై భారీ దాడులు చేయడానికి సిద్ధం ఉన్నట్లు ఓ తాజా నివేదిక పేర్కొంది.



ఢిల్లీ : అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం గురించి తర్జనభర్జన జరుగుతున్న వేళ, తాజాగా ఓ నివేదిక కీలక విషయాలు వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు అందిన 96 గంటల్లోగా, ఇరాన్ పై భారీ సైనిక దాడులు చేసేందుకు పశ్చిమాసియాలోని యూఎస్ బలగాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొంది. అంతేకాదు ఈ సైనిక దాడులు నిర్వహించడానికి ఆ ప్రాంతంలో తగినంత స్థాయిలో అమెరికా సైనిక బలగాలను మోహరించినట్లు పేర్కొంది. ఈ విషయాన్ని అమెరికాకు చెందిన ఇద్దరు అధికారులు వెల్లడించినట్లు సీఎన్ ఎన్ తన నివేదికలో పేర్కొంది. ఇరాన్ రాడార్లు, క్షిపణి ప్రయోగ కేంద్రాలు, ఇతర సైనిక ఆస్తులు, స్థావరాలపై భారీ దాడులు చేసేందుకు అనువుగా అమెరికా సన్నాహాలు చేస్తున్నట్లు సదరు నివేదిక వెల్లడించింది. "ఇది చాలా పెద్ద ప్రయత్నం అవుతుంది" అని సదరు అమెరికా అధికారులు చెప్పినట్లు వెల్లడించింది. "మాజీ అమెరికా అధికారులు కూడా ఇదే విధంగా భావిస్తున్నారు. అయితే వారిలో కొందరు ట్రంప్ ఈ దాడులకు ఆదేశాలు జారీ చేస్తారా, లేదా అనే అనుమానం తమకు లేదని, అయితే ఎప్పుడు ఆదేశిస్తారు అన్నదే తమ ముందున్న ప్రశ్న అని చెప్పారు. బహుశా ఈ ఆదేశం ఈ ఏడాది చివర్లో ఎప్పుడైనా రావచ్చు, బహుశా అమెరికా మధ్యంతర ఎన్నికల తర్వాత వచ్చే అవకాశం ఉంది" అని నివేదిక పేర్కొంది.

ఇరాన్‌తో యుద్ధం అంత సులువు కాదు!

నివేదిక ప్రకారం, మిగతా..2లో

విశాఖ తూర్పు తీరాన్ని శాన్‌ఫ్రాన్సిస్కోగా తీర్చిదిద్దుతాం' - ఆనంద్ మహీంద్రా పోస్టుకు లోకేశ్ రిప్లై



- గంగవరం బీచ్ అందాలను పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా ప్రపంచానికి పరిచయం చేయగా
- విశాఖ ప్రత్యేకతను చాటినందుకు 'ఎక్స్'లో ఆయనకు మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

అమరావతి : ప్రకృతి అందాలు, టెక్నాలజీ హంగులు ఈ రెండింటి కలయికతో విశాఖను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని

ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు.. అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

- అర్ణబ్ తుపాను ముప్పు నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశం
- బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక
- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు, ఏపీ తీరానికి రెడ్ అలర్ట్ జారీ
- తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్లకు సూచన



అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశారు. తుపాను కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో తుపానును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, దాని తీవ్రతకు అనుగుణంగా ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. "తుపాను ప్రభావంతో కురిసే వర్షాలు, మిగతా..2లో

ఏపీకి అర్ణబ్ ముప్పు అప్రమత్తమైన ప్రభుత్వం

- బంగాళాఖాతంలో కొనసాగుతున్న తుపాను కొన్ని గంటల్లో తీవ్ర తుపానుగా మారనుంది.
- రేపు అతి తీవ్ర తుపానుగా మారనుంది.
- ఈ క్రమంలోనే సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తమయ్యారు.



ఢిల్లీ : బంగాళాఖాతంలో అర్ణబ్ తుపాను తీరం దిశగా దూసుకొస్తుంది. గడిచిన 6 గంటల్లో 13 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా కదులుతోంది. విశాఖకు 580 కిలోమీటర్లు, కాకినాడకు 660 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 760 కిలోమీటర్లు, బాపట్లకు 830 కిలోమీటర్లు, గోపాల్‌పూర్ (ఒడిశా)కు 550 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమైంది. ఈ క్రమంలోనే ఇవాళ అర్ధరాత్రికి నాటికి తీవ్ర తుపానుగా బలపడనుంది. రేపు (మంగళవారం) అతి తీవ్ర తుపానుగా మారనుంది. ఎల్లుండి (బుధవారం) ఉదయం బాపట్ల-విశాఖ మధ్య యానాం వద్ద తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గరిష్ఠంగా 140 కిలోమీటర్లు వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. రేపు, ఎల్లుండి కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురవడంతో పాటు బలమైన ఈదురుగాలులు మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు.. అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

వీచే గాలులు, సంభవించే వరద ప్రవాహాల తీవ్రతను ముందుగానే అంచనా వేయాలి. గతంలో వచ్చిన తుపానుల సమాచారాన్ని విశ్లేషించి రైతులకు, ప్రజలకు నిరంతరం హెచ్చరికలు జారీ చేయాలి. ఎలాంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది" అని చంద్రబాబు అన్నారు. తీరప్రాంతాల్లోని ప్రజలను వెంటనే గుర్తించి, సమీపంలోని తుపాను షెల్టర్లకు తరలించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు వర్చువల్ విధానంలో హాజరై తమ జిల్లాల్లోని పరిస్థితులను, తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, 'అర్ణబ్' తుపాను అక్టోబర్ 26 అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, 27న అతి తీవ్ర తుపానుగా బలపడనుంది. అక్టోబర్ 28వ తేదీ ఉదయం బాపట్లవిశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని, అందువల్ల ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.

తుమ్మిడిహెట్టిపై గుడ్‌న్యూస్.. తెలంగాణ ప్రతిపాదనకు ఫడ్నవీస్ సానుకూలం!

అందుకే 152 మీటర్లకు పెంచాలని కోరుతోంది.

అధ్యయనానికి అధికారుల కమిటీ

బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలు, పరిహారం వంటి అంశాలపై రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలపైనా అధ్యయనం చేయాలని సూచించారు. కేంద్ర జల సంఘం కూడా తన పరిధిలో సాంకేతిక అంశాలను పరిశీలించనుంది.

రెండు లక్షల ఎకరాలకు సాగునీరు

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. గిరిజన, అటవీ ప్రాంతాల్లో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్టు కీలకమని రేవంత్‌రెడ్డి వివరించారు. బ్యారేజీ వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు అక్కడి నిబంధనల ప్రకారం పూర్తి పరిహారం చెల్లిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. బ్యారేజీ ఎత్తు ఖరారైతే తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించే మార్గం రూపకల్పన, భూసేకరణ వంటి పనులను వేగవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. చర్చలు సానుకూలంగా సాగినా.. నిర్మాణానికి తుది అనుమతి లభించిందని ఇప్పుడే చెప్పలేం. అధికారుల అధ్యయనం, తదుపరి చర్చల తర్వాతే దీనిపై స్పష్టత రానుంది.

హైదరాబాద్‌లో డ్రగ్స్‌పై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం

ఈ ఆపరేషన్‌లో 70 మంది గంజాయి వినియోగదారులను గుర్తించారు. 66 మందికి వైద్య పరీక్షలు జరపగా.. ఈ పరీక్షల్లో డ్రగ్స్ తీసుకున్నట్లుగా పాజిటివ్‌గా నిర్ధారించారు. గంజాయి వినియోగదారుల్లో ముగ్గురు బాలురని, మరో 65 మందిని పునరావాస కేంద్రాలకు ఈగల్ అధికారులు తరలించారు. అలాగే, గాంధీ రిహాబిలిటేషన్ సెంటర్‌కు 45 మందిని, ఆమనగల్ కేంద్రానికి 15 మంది, కొత్తూరు కేంద్రానికి ఐదుగురిని తరలించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గంజాయి సరఫరా మూలాలు, ఇతర వ్యక్తుల పాత్రపై ఈగల్ అధికారులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితురాలు షేక్ జాతెన్ బీపై గతంలో మరో ఏడు కేసులు ఉన్నట్లు గుర్తించారు.

గచ్చిబౌలిలో డ్రగ్స్ పట్టివేత

అలాగే, గచ్చిబౌలిలో తెలంగాణ టాస్క్‌ఫోర్స్ టీమ్ తనిఖీలు చేసి డ్రగ్స్‌ను పట్టుకున్నారు. ఖాజాగూడా సర్వీస్ రోడ్డులో డ్రగ్స్ విక్రయిస్తుండగా ఫొటోగ్రాఫర్ ఏ. సాయిరామ్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడు సాయిరామ్ నుంచి 4.45 గ్రాముల వీణహీూ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గ్రాము రూ.10 వేల చొప్పున అతడు డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడి నుంచి కారు, డిజిటల్ వేయింగ్ మిషన్, 2 సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు మహేశ్‌రెడ్డి, తాండ్ర హరిశ్చంద్ర కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందినవారిగా గుర్తించారు

ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన రాంచందర్ రావు

అంతటి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత ఇంత దిగజారుడు భాష మాట్లాడటం అత్యంత విచారకరమని అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు... గత పన్నెండున్నర ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నేతల్లో తీవ్రమైన అసహనం కనిపిస్తోందని విమర్శించారు. ఆ నిరాశా నిస్పృహల నుంచే మోదీ తండ్రిని కూడా నిందిస్తూ ఖర్గే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఖర్గే మాట్లాడిన సభలో వేదికపై ఉన్న నేతల కంటే కింద ఉన్న ప్రేక్షకులు చాలా తక్కువగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీహార్‌లోని పాట్నాలో నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తుండగా... ఓ వ్యక్తి మోదీ ఓడిపోరంటూ నినాదాలు చేశారు. దీనికి స్పందించిన ఖర్గే.. 'మోదీ కా బాప్ భీ జాయేగా' (మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే) అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పాట్నాలోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది.

290 కోట్లు దాటిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు.. రేవంత్ రెడ్డి స్పందన

దీనివల్ల టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా 40 శాతం నుంచి 67 శాతానికి పైగా పెరిగింది. మహిళల నుంచి వస్తున్న భారీ స్పందనతో మొత్తం ఆక్యుపెన్సీ రేటు కూడా 69 శాతం నుంచి 98 శాతానికి చేరడం విశేషం. తాము అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఈ పథకాన్ని ప్రారంభించామని ప్రభుత్వం పలు సందర్భాల్లో గుర్తుచేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ... మహాలక్ష్మి పథకం కేవలం ఉచిత ప్రయాణం మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మహిళలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందని, వారు విద్య, ఉపాధి, ఇతర అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించగలుగుతున్నారని తెలిపారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా మరిన్ని బస్సు సర్వీసులను నడిపేందుకు టీజీఎస్ఆర్టీసీ చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

పార్లమెంట్ వద్ద అగ్నిప్రమాదం- అసలేమైందంటే?

పార్లమెంట్ సమీపంలోని నార్త్ బ్లాక్‌లో సోమవారం భారీగా పొగలు వచ్చాయి. అయితే మరమ్మతుల సమయంలో మంటలు చెలరేగి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

దేశ రాజధాని దిల్లీలోని పార్లమెంట్ సమీపంలో ఉన్న నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. సోమవారం ఉదయం భవనం వెనుక వైపు నుంచి దట్టమైన నల్లటి పొగలు రావడంతో అక్కడ కలకలం రేగింది. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక శాఖ సిబ్బంది ఆరు వాహనాలతో అక్కడికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. నార్త్ బ్లాక్‌లో ప్రస్తుతం మరమ్మతులు, కొన్ని పనులు జరుగుతున్నాయి. భవనం పైకప్పుపై కార్మికులు వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. అక్కడ ఏర్పాటు చేసిన ఏసీ బాయిలర్ వద్ద మంటలు చెలరేగినట్లు అగ్నిమాపక శాఖ తెలిపింది. వెల్డింగ్ పనుల సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వచ్చి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే, ప్రమాదానికి కచ్చితమైన కారణం ఏమిటనేది ఇంకా నిర్ధారణ కాలేదు. సోమవారం ఉదయం 11.10 గంటలకు నార్త్ బ్లాక్ నుంచి పొగలు వస్తున్నట్లు దిల్లీ అగ్నిమాపక శాఖకు సమాచారం అందింది. దీంతో వెంటనే ఆరు అగ్నిమాపక వాహనాలను ఘటనాస్థలికి పంపించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికే మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ భవనానికి ఎంతమేర నష్టం జరిగిందనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. వెల్డింగ్ పనుల సమయంలో మంటలు ఎలా చెలరేగాయి, ఏసీ బాయిలర్ వద్ద ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు ఏమిటనే అంశాలపై పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.


నార్త్ బ్లాక్ చరిత్ర ఏంటి?

అయితే నార్త్ బ్లాక్ దిల్లీలోని రైసినా హిల్స్ ప్రాంతంలో ఉంది. ఇది కేంద్ర ప్రభుత్వానికి చెందిన ముఖ్యమైన కార్యాలయాలున్న భవనం. ఇక్కడ కేంద్ర హోం శాఖ, ఆర్థిక శాఖ కార్యాలయాలు ఉన్నాయి. పార్లమెంట్ భవనానికి సమీపంలో ఉండటంతో ఈ ప్రాంతం ఎప్పుడూ కీలకంగా ఉంటుంది. అలాంటి భవనంలో పొగలు రావడంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించారు. ఈ ఘటనపై రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవ్‌రా కూడా స్పందించారు. పార్లమెంట్‌కు వెళ్తున్న సమయంలో నార్త్ బ్లాక్ వెనుక వైపు నుంచి దట్టమైన పొగలు రావడం గమనించినట్లు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అక్కడ అగ్నిప్రమాదం జరిగి ఉండొచ్చని పేర్కొంటూ, అందరూ సురక్షితంగా ఉండాలని ఆకాంక్షించారు. అత్యవసర సేవల సిబ్బంది వేగంగా స్పందిస్తున్నారని ఆశిస్తున్నట్లు తెలిపారు. పొగలు వస్తున్న దృశ్యానికి సంబంధించిన ఫొటోను కూడా ఆయన పంచుకున్నారు.

విశాఖ తూర్పు తీరాన్ని శాన్‌ఫ్రాన్సిస్కోగా తీర్చిదిద్దుతాం' - ఆనంద్ మహీంద్రా పోస్టుకు లోకేశ్ రిప్లై

మొదటి పేజి తరువాయి

మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. గంగవరం బీచ్ అందాలను పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా ప్రపంచానికి పరిచయం చేయగా, విశాఖ ప్రత్యేకతను చాటినందుకు ఆయనకు మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కొండలు సముద్రాన్ని తాకే తీరం, ఎత్తైన రాతి కొండచరియలు, వేగంగా విస్తరిస్తున్న టెక్నాలజీ రంగం ఇవే విశాఖ అసలైన బలాలని వివరించారు. ప్రకృతి సౌందర్యాన్ని దెబ్బతీయకుండా ప్రపంచ స్థాయి సాంకేతిక పరిశ్రమలు అభివృద్ధి చెందేలా నగరాన్ని తీర్చిదిద్దాలన్నదే తమ విజన్ అని లోకేశ్ తెలిపారు. తూర్పు తీరానికి శాన్‌ఫ్రాన్సిస్కోగా విశాఖను నిలబెడతామన్నారు. ప్రకృతి, ప్రగతి కలిసి నడిచే నగరంగా విశాఖను తీర్చిదిద్దుతామని లోకేశ్ వెల్లడించారు. గంగవరం బీచ్‌పై ఆనంద్ మహీంద్రా చేసిన పోస్టుకు మంత్రి లోకేశ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు.



గంగవరం బీచ్‌పై ఆనంద్ మహీంద్రా ఆసక్తికర పోస్టు :

విశాఖపట్నం సమీపంలోని గంగవరం బీచ్ సుందర దృశ్యాలకు ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా ఫిదా అయ్యారు. దీంతో గంగవరం బీచ్ గురించి ఆనంద్ మహీంద్రా 'ఎక్స్'లో ఆసక్తికర పోస్టు చేశారు. దేశంలో ఎక్కువ మంది మాట్లాడుకునే తీరప్రాంత ప్రదేశాల్లో గంగవరం బీచ్ ఎందుకు లేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఇది మనకు తెలిసిన కొబ్బరి చెట్లు, పచ్చదనం దృశ్యాలు కనిపించే సాధారణ బీచ్ లాంటిది కాదు. ఎత్తయిన రాతి కొండలతో కలినమైన, ఒకవిధమైన పురాతన అందం ఇక్కడ కనిపిస్తోంది. ఇలాంటి సహజ సౌందర్యమే నన్ను ఎక్కువగా ఆకర్షిస్తుంది. ఇక్కడ సేద తీరడమే కాకుండా, ప్రశాంతంగా కాసేపు ఆత్మపరిశీలన కూడా చేసుకోవచ్చు. ప్రస్తుతం ప్రపంచంలోని టెక్ దిగ్గజాలు. భారీ డేటా సెంటర్లు, ఏఐ మౌలిక సదుపాయాల నిర్మాణానికి వైజాగ్‌కు వస్తున్నాయి. కానీ, ఇక్కడి దృశ్యాలను చూస్తుంటే లక్షల ఏళ్ల క్రితమే ప్రకృతి పెద్దఎత్తున విస్తరణ ప్రక్రియను మొదలుపెట్టినట్లు అనిపిస్తోంది. విశాఖపట్నం ప్రధాన టెక్ హబ్‌గా వేగంగా మారుతోంది. అదేవిధంగా అత్యంత అద్భుతమైన తీరప్రాంత పర్యాటక ప్రదేశంగానూ వెలుగొందే సత్తా దీనికి ఉందని భావిస్తున్నా" అని ఆనంద్ మహీంద్రా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. నెటిజన్లు ఆయన వ్యాఖ్యలతో ఏకీభవించారు.

96 గంటల్లో ఇరాన్‌పై భీకర దాడులకు యూఎస్ ప్లాన్ చేస్తోందా?

మొదటి పేజి తరువాయి

ఇరాన్ బలగాలకు ఇప్పుడు అమెరికా సైనిక వ్యూహాలపై బాగా అవగాహన ఏర్పడింది. అందువల్ల అమెరికా సైన్యానికి, ఇరాన్ లోని లక్ష్యాలను ఛేదించడం కాస్త కష్టతరంగానే ఉంటుందని సదరు అధికారులు అంగీకరించారు. ఏది ఏమైనప్పటికీ, యూఎస్ సెంట్రల్ కమాండ్ , పెంటగాన్ అధికారులు ఇరాన్ లోని ఇంధన మౌలిక సదుపాయాలు, సైనిక స్థావరాలు, అణుకర్మాగారాలతో సహా వివిధ కీలక లక్ష్యాల జాబితాను రూపొందిస్తున్నారు. మధ్యంతర ఎన్నికల తర్వాత ఏం చేయాలనే విషయంలో ట్రంప్ ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని, అయినప్పటికీ భారీ సైనిక చర్యకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోందని సదరు అధికారులు సీఎన్ ఎన్ కు చెప్పారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ట్రంప్ గతంలోనూ ఇలాంటి సైనిక చర్యలకు మొగ్గు చూపి, చివరి క్షణంలో వెనక్కి తగ్గిన సందర్భాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. అయితే సీఎన్ ఎన్ ప్రచురించిన ఈ నివేదికపై వ్యాఖ్యానించడానికి శ్వేతసౌధం నిరాకరించింది. పెంటగాన్ కు చెందిన ఓ అధికారి దీనిపై స్పందిస్తూ, అమెరికా అధ్యక్షుడు ఆదేశించిన పని చేయడమే తమ పని పేర్కొన్నారు.

ప్రతీకార దాడులు తప్పవ్!



ఒకవేళ అమెరికా, ఇజ్రాయెల్ కలిసి మళ్లీ ఇరాన్ , యెమెన్ లోని హూతీలపై దాడులు చేస్తే, అవి కూడా తీవ్ర ప్రతీకార దాడులకు దిగవచ్చని యూఎస్ నిఘా వర్గాలు సూచిస్తున్నాయి. బహుశా పశ్చిమాసియా అంతటా, అంతకు మించి కూడా అమెరికన్ సైనికులను, సైనిక స్థావరాలను లక్ష్యం చేసుకుని ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నాయి. "డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ జే క్లేటన్ నుంచి యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు అక్టోబర్ 23న ఒక మెమో అందింది. అందులో అమెరికా సెనికులను లక్ష్యంగా చేసుకునే ప్రయత్నాలను ఇరాన్ భారీగా పెంచిందని ఉంది. పశ్చిమాసియా, కొన్ని ఇతర దేశాల్లో ఈ కుట్ర ప్రయత్నాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని అమెరికా నిఘా వర్గాలు కనుగొన్నట్లు అందులో ఉంది. అయితే ఇరాన్ , హూతీలు మొదటిగా, అమెరికా, ఇజ్రాయెల్ సైనికులపై దాడులు చేసే అవకాశం లేదని అమెరికా నిఘా అధికారులు భావిస్తున్నారు. కానీ అమెరికా, ఇజ్రాయెల్ లు దాడులు చేస్తే మాత్రం, అవి ప్రతీకారం తీర్చుకోవడానికి వెనుకాడవని అంచనా వేస్తున్నారు" అని సీఎన్ ఎన్ తన నివేదికలో పేర్కొంది. 'ఇరాన్, హూతీల నుంచి ఎదురవుతున్న తీవ్ర ప్రతిఘటనల వల్ల ప్రాంతీయ ముప్పు ఏర్పడుతోంది. అందుకే సౌదీ అరేబియా-రియాద్ లోని అమెరికా రాయబార కార్యాలయానికి ఖాళీ చేయమని ఆదేశాలు అందాయి. రానున్న రోజుల్లో ఇతర కేంద్రాలకు కూడా ఇలాంటి ఆదేశాలు అందే అవకాశం ఉంది. ఒకవేళ అలాంటి ఆదేశాలు రాకపోయినా, సిబ్బందిని మాత్రం తగ్గించే అవకాశం ఉందని ఓ అధికారి తమకు చెప్పినట్లు' సీఎన్ ఎన్ పేర్కొంది.

దాడులకే మొగ్గు చూపుతున్న నెతన్యాహు

ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ అమెరికాతో కలిసి ఇరాన్ పై మళ్లీ దాడులు చేయాలని భావిస్తున్నారు. కానీ ట్రంప్ ప్రభుత్వం మాత్రం కాస్త వేచిచూడమని ఆయనకు చెప్పినట్లు సీఎన్ ఎన్ తన నివేదికలో పేర్కొంది. "ఎన్నికలకు ముందే ఇరాన్ పై సంయుక్త దాడులు చేద్దామని నెతన్యాహు కోరుతున్నారు. ఇందుకోసం ట్రంప్ ను ఒప్పించడానికి కూడా ప్రయత్నించారు. కానీ ట్రంప్ పచ్చజెండా ఊపలేదు" అని ఇజ్రాయెల్ భద్రతా వర్గాలు తమకు తెలిపాయని సీఎన్ ఎన్ పేర్కొంది.

అర్ణబ్' తుపానుపై వదంతులు నమ్మొద్దు.. అప్రమత్తతో గండం నుంచి బయటపడదాం

మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలో, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. అనవసరమైన వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ), విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా యంత్రాంగం ఇచ్చే సూచనలను మాత్రమే పాటించాలని సోమవారం స్పష్టం చేశారు. ఈ విపత్కర సమయంలో ప్రజలందరూ సమన్వయంతో, ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించి తుపాను గండం నుంచి సురక్షితంగా బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు మంత్రి సోషల్ మీడియా ద్వారా ప్రజలకు సూచనలు జారీ చేశారు.

తీరం దాటేది అప్పుడే.. రెడ్ అలర్ట్ జారీ

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అర్ణబ్' తుపానుగా మారి వేగంగా బలపడుతోందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇది అక్టోబర్ 26, సోమవారం అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, మరుసటి రోజు అక్టోబర్ 27న అతి తీవ్ర తుపానుగా మారనుందని తెలిపారు. అక్టోబర్ 28, బుధవారం ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.

ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం

ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణరక్షణకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలు తక్షణమే అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. ప్రతి ఒక్కరూ అత్యవసర మందులు, తాగునీరు, ఆహార పొట్లాలు, టార్చ్‌లైట్లు, బ్యాటరీలు, ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. బలహీనమైన భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులకు దూరంగా ఉండాలని, వర్షాలు, పిడుగుల సమయంలో బయటకు రావద్దని హెచ్చరించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే వెళ్లినవారు వెంటనే తీరానికి చేరుకోవాలని ఆదేశించారు.

రైతన్నలకు ప్రత్యేక సూచనలు

రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలను వాతావరణం అనుకూలించగానే కోసి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ధాన్యం రాశులు, ఇతర ఉత్పత్తులను టార్పాలిన్లతో కప్పి భద్రపరచుకోవాలన్నారు. అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకు ఊతంగా కర్రలు ఏర్పాటు చేసుకోవాలని, పొలాల్లో నీరు నిలిచిపోకుండా మురుగు కాలువలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలను ఎత్తైన, సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలన్నారు. అయితే, పంటలను కాపాడే ప్రయత్నంలో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ప్రాణాలను పణంగా పెట్టవద్దని ఆయన గట్టిగా కోరారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారుల సలహాలను పాటిస్తూ ఈ విపత్తును ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

మొదటి పేజి తరువాయి

ఏపీకి అర్ణబ్ ముప్పు - అప్రమత్తమైన ప్రభుత్వం

వీస్తాయని వివరించారు. రేపు(మంగళవారం) కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, విశాఖ, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురువనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రేపు(మంగళవారం) కోస్తా తీరం వెంబడి 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు పేర్కొన్నారు. చెట్లు, భారీ హోర్డింగ్స్, శిథిలావస్థలోని భవనాల్లో ఉండరాదని హెచ్చరించారు. ఇబ్బందులు ఉంటే ముందే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. అదేవిధంగా మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని, ఎగసిపడే అలల వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగవద్దని హెచ్చరికలు జారీ చేశారు. అత్యవసర సహాయక చర్యలకు జిల్లాల్లో 7 ఎన్‌డీఆర్ఎఫ్, 8 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల సంస్థ టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1070, 1800 425 0101ను సంప్రదించాలని అధికారులు తెలియజేశారు. తుపాను దృష్ట్యా క్యాంపు కార్యాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎస్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణశాఖల అధికారులతో పాటు వర్చువల్‌గా వివిధ శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లు, పోలీసులు హాజరయ్యారు. తుపాను గమనం అంచనా వేసి ముందు జాగ్రత్తలు చేపట్టాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని సూచించారు. వర్షాలు, గాలులు, వరదలు అంచనా వేస్తూ చర్యలు చేపట్టాలని, రైతులు, ప్రజలను ఎప్పటికప్పుడు హెచ్చరించాలని సూచనలు చేశారు. తీరప్రాంతాల ప్రజలను షెల్టర్లకు తరలించాలని కలెక్టర్లను చంద్రబాబు ఆదేశించారు. అర్ణబ్ తుపానుతో రాష్ట్రానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. మంగళవారం, బుధవారం భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీరప్రాంత ప్రజలు అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని చెప్పారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ధాన్యం, వ్యవసాయ ఉత్పత్తులు తడవకుండా టార్పాలిన్లతో కప్పి భద్రపరచుకోవాలని అన్నదాతలకు సూచించారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, పశువులు, కోళ్ల షెడ్లు, వ్యవసాయ పరికరాలను సురక్షితంగా ఉంచుకోవాలని తెలిపారు. వర్షాల సమయంలో ఎరువుల వినియోగం వాయిదా వేయాలన్నారు. పంట నష్టం ఫొటోలు, వివరాలు భద్రపరచుకోవాలని సూచించారు. అదేవిధంగా వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణ సంస్థ సూచనలను పాటించాలని, పంటల కంటే ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అప్రమత్తమైన ఆర్ అండ్‌బీ శాఖ : అర్ణబ్ తుపాను ముప్పు దృష్ట్యా ఆర్‌అండ్‌బీ శాఖ అప్రమత్తమైంది. 'తుపా

ఘనంగా టి.వై.జె.ఎఫ్. వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ జన్మదిన వేడుకలు

సంగారెడ్డిలో రెడ్లస్ హోటల్ ఘనంగా షేక్ మహబూబ్ జన్మదిన వేడుకలు



ఆందోల్ ప్రతినిధి,అక్టోబర్ 26, ప్రజా న్యూస్ : (మొహమ్మద్ అబేద్) :
టి.వై.జె.ఎఫ్.వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ జన్మదిన వేడుకలు సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, సన్నిహితులు, సంఘం సభ్యులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో పాల్గొన్న వారు షేక్ మహబూబ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య జరిగింది.

సంగారెడ్డిలో మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసిన టీ వై జె ఎఫ్ సంగారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మహమ్మద్ అబేద్.



ఆందోల్-జోగిపేట, ప్రజా న్యూస్ ప్రతినిధి ఎం.డి. ఆబేద్ :
తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనర్సింహ సాహెబ్‌కు కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అబిద్ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మహమ్మద్ అబిద్ మాట్లాడుతూ.. విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ఈ పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరుకున్నారు.మంత్రి దామోదర రాజనర్సింహ ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని మహమ్మద్ అబిద్ ఆకాంక్షించారు.

ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా 'ఓట్ బచావో - దేశ్ బచావో' ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ విలేకరుల సమావేశంలో నాయకుల పిలుపు ఇచ్చారు.



కుత్బుల్లాపూర్. అక్టోబర్.26 ప్రజా న్యూస్ నెట్వర్క్ :
మేడ్చల్ మల్కాజిగిరి: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఏ ఐ సి సి ఆదేశాల మేరకు చేపట్టిన 'ఓట్ బచావో దేశ్ బచావో' ప్రచార కార్యక్రమంలో భాగంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ డి సి సి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన జిల్లా స్థాయి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి తమిళ్ నాడు రాష్ట్రం నుంచి విచ్చేసిన ఏఐసిసిఅబ్జర్వర్ మోహన్ కుమార మంగళం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కౌలన్ హన్మంత్ రెడ్డి మాజీ టి పి సి సి ప్రధాన కార్యదర్శి నర్సభూపతి రెడ్డి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓట్ బచావో దేశ్ బచావో' ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ ప్రచార కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం కీలకమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు , సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళ నాయకులు పాల్గొన్నారు

వాల్మీకి జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు



కుత్బుల్లాపూర. అక్టోబర్ .26 ప్రజా న్యూస్ నెట్వర్క్ :
సాయిబాబా నగర్ డివిజన్ రామ్ లీలా మైదానంలో బోయ సోదరులు ఏర్పాటు చేసిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకల్లో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి గారి గొప్పతనం, ఆయన జీవితం, సమాజానికి అందించిన సందేశాల గురించి మన్నె రాజు మాట్లాడారు.అనంతరం బోయ సోదరులు తమకు ఒక సామాజిక భవనం అవసరమని మన్నె రాజు ని కోరారు. దీనిపై స్పందించిన మన్నె రాజు , బోయ సోదరుల కోసం స్థలం ఏర్పాటు చేసి, భవన నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ విషయంపై తక్షణమే జిల్లా కలెక్టర్ తో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టేలా చూస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బోయ సోదరులు లక్ష్మణ్, రామకృష్ణ, అజయ్‌తో పాటు పలువురు బోయ సోదరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి సత్తి రెడ్డి , గురువారెడ్డి గణేష్ సాయి రెడ్డి మరియు ఇతర ముఖ్య నాయకులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.బోయ సోదరుల అభ్యర్థన మేరకు సామాజిక భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన మన్నె రాజు.

గురునానక్ మందిర్ కమాన్ ల నిర్మాణానికి భూమిపూజ చేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి పట్టణం లోని గురునానక్ మందిర్‌ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేసిన జగ్గారెడ్డి



(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 26 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్ : గత గురునానక్ జయంతి సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సంగారెడ్డి పట్టణంలోని బ్రాహ్మణవాడలో రెండు కమాన్ల నిర్మాణానికి జగ్గారెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. గురునానక్ మందిర్‌కు వెళ్లే ప్రవేశ మార్గంలో ఒకటి, మందిర్‌కు సమీపంలోని భవాని మందిర్ రోడ్డులో మరొక కమాన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.అంతకుముందు గురునానక్ మందిర్‌ను సందర్శించిన జగ్గారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర్ ప్రతినిధులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిని త్వరలో పరిష్కరిస్తానని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు.మందిర్ ప్రాంగణంలో రావిచెట్టు కింద ఉన్న నాగదేవత ఆలయాన్ని అభివృద్ధి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్‌కు జగ్గారెడ్డి సూచించారు. ప్రస్తుతం ఉన్న విగ్రహాలను యథాస్థానంలోనే ఉంచి అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిక్కు ప్రముఖులు డాక్టర్ సర్దార్ సురేందర్ గోపి సింగ్, సర్దార్ తేజేందర్ సింగ్, సర్దార్ స్వరణ్ సింగ్, సర్దార్ సత్‌పాల్ సింగ్, డాక్టర్ సర్దార్ భరత్ సింగ్, సిక్కు గురువు గురుదేవ్ సింగ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, నరేన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చేజర్లలో నామినేషన్ల తిరస్కరణపై వివాదం

ఎన్నికల అధికారుల తీరుపై ప్రతిపక్షాల ఆగ్రహం

రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం



చేజర్ల 26 ప్రజాన్యూస్ నెట్ వర్క్, రిపోర్టర్, యు. ప్రవీణ్ కుమార్ :స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల పరిశీలనలో చేజర్ల మండలంలో ఎన్నికల అధికారుల వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నామినేషన్ల స్వీకరణ, తిరస్కరణలో పక్షపాతం చోటుచేసుకుందని, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిణామం మండల రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.చేజర్ల మండలంలో మొత్తం 10 ఎంపీటీసీ సెగ్మెంట్లు గాను 72 నామినేషన్లు దాఖలు చేశారు.ఈ స్థానాలకు సంబంధించి అధికార పార్టీ తరపున 30 నామినేషన్లు దాఖలు కాగా వాటిలో 16 నామినేషన్లను ఆమోదించినట్లు ఆరోపణలు చేస్తున్న వర్గాలు వెల్లడిస్తున్నాయి.మరోవైపు ప్రతిపక్ష పార్టీల తరపున 45 నామినేషన్లు దాఖలు చేయగా, వాటిలో కేవలం ఐదు మాత్రమే నిలిచాయని పేర్కొంటున్నాయి. ఈ సంఖ్యల్లో కనిపిస్తున్న వ్యత్యాసంపై రాజకీయ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి.ప్రతిపక్ష అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించేందుకు సరైన కారణాలు చూపలేదని, చిన్నచిన్న సాంకేతిక అంశాలను సాకులుగా చూపి నామినేషన్లను తిరస్కరించారన్నది ప్రధాన ఆరోపణ. ఎన్నికల ప్రక్రియలో అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా వ్యవహరించారంటూ పలువురు విమర్శిస్తున్నారు.ఆర్డీవోకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటూ ఆవేదన తమ నామినేషన్లు తిరస్కరణకు గురికావడంతో బాధిత అభ్యర్థులు ఆత్మకూరు ఆర్డీవోను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే తమకు ఆశించిన పరిష్కారం లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే అంశంపై అధికారిక సమాచారం అందుబాటులోకి రావాల్సి ఉంది.రిటర్నింగ్ అధికారి ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లొంగి ఏకపక్షంగా వ్యవహరించారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించి, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు పోటీ చేసే అవకాశం లేకుండా నామినేషన్లను తిరస్కరించారంటూ కొందరు రాజకీయ నాయకులు విమర్శిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఉన్నతాధికారుల విచారణ ద్వారా వాస్తవాలు నిర్ధారణ కావాల్సి ఉంది.


రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సన్నాహాలు

నామినేషన్ల తిరస్కరణ వ్యవహారంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పలువురు అభ్యర్థులు రాజకీయ నాయకులు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. నామినేషన్ల పరిశీలనలో అనుసరించిన విధానం తిరస్కరణకు పేర్కొన్న కారణాలు ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను పరిశీలించాలని వారు కోరే అవకాశం ఉంది.ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలవాలంటే నామినేషన్ల పరిశీలన పారదర్శకంగా జరగడం అత్యంత కీలకం. ఏ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించినా, అందుకు నిబంధనలకు అనుగుణమైన స్పష్టమైన కారణాలు ఉండాలి.అభ్యర్థులకు అందుబాటులో ఉన్న చట్టబద్ధమైన ఫిర్యాదు, అప్పీల్ మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకునే అవకాశం కల్పించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల వివరణతోనే స్పష్టత

చేజర్ల మండలంలో నామినేషన్ల ఆమోదం తిరస్కరణకు సంబంధించిన పూర్తి వివరాలు, ప్రతి తిరస్కరణకు పేర్కొన్న అధికారిక కారణాలు ఫిర్యాదులపై ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయాలు వెలుగులోకి వస్తేనే ఈ వివాదంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. సంబంధిత రిటర్నింగ్ అధికారి ఎన్నికల ఉన్నతాధికారులు ఈ ఆరోపణలపై స్పందించాల్సి ఉంది.ప్రస్తుతం వెలువడుతున్న ఆరోపణలు విమర్శలు విచారణలో నిర్ధారణ కావాల్సి ఉన్నాయి. ఎన్నికల అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించారా నామినేషన్ల తిరస్కరణలో ఏవైనా అవకతవకలు చోటుచేసుకున్నాయా బాధిత అభ్యర్థుల ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్న ప్రశ్నలకు అధికారిక సమాధానాలు రావాల్సి ఉంది. నిష్పక్షపాత విచారణతో వాస్తవాలు వెలుగులోకి రావాలని స్థానిక రాజకీయ వర్గాలు కోరుతున్నాయి.

గవర్నర్ కోటాలో భర్తీ చేసే నామినేటెడ్ ఎమ్మెల్సీలో ఉమ్మడి నల్గొండ జిల్లా బీసీలకు అవకాశం కల్పించాలి.



మిర్యాలగూడ అక్టోబర్ 26 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య) వచ్చే నెలలో గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవిలో ఉమ్మడి నల్గొండ జిల్లా బీసీలకు అవకాశం కల్పించాలని కోరుతూ,ఈరోజు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ,ఉమ్మడి నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు ఎన్నికల సమయంలో ఓటర్లుగానే మిగిలిపోతున్నారని,రాజకీయ పదవులు,నిర్ణయాధికారంలో మాత్రం తగిన ప్రాతినిధ్యం పొందలేకపోతున్నారని అన్నారు.ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపు సమయంలో కూడా ఆర్థిక స్థోమత లేదనే సాకుతో బీసీలకు అవకాశాలు నిరాకరించారని విమర్శించారు.బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకుండా సామాజిక న్యాయం సాధ్యంకాదని స్పష్టం చేశారు.వచ్చే నెలలో గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవిలో ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి అర్హత,సామాజిక సేవ,పార్టీ పట్ల నిబద్ధత కలిగిన బీసీ నాయకుడికి అవకాశం కల్పించి,బీసీల ఆత్మగౌరవాన్ని గౌరవించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని ఆయన కోరారు.కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో సామాజిక న్యాయం,కులగణన,బీసీల హక్కుల గురించి మాట్లాడుతున్నప్పటికీ,తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఆ స్ఫూర్తికి అనుగుణంగా బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడం లేదని విమర్శించారు.సామాజిక న్యాయం మాటలకే పరిమితం కాకుండా,ఆచరణలోనూ బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ఉమ్మడి నల్గొండ జిల్లా బీసీలకు గవర్నర్ కోటా నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవిలో అవకాశం కల్పించి, కాంగ్రెస్ పార్టీ బీసీల పట్ల తన నిబద్ధతను నిరూపించుకోవాలని జాజుల లింగం గౌడ్ కోరారు..

అన్యాయం జరిగిన భవన నిర్మాణ కార్మికులకు అండగా నిలుస్తున్న బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



కుత్బుల్లాపూర్. అక్టోబర్.26 ప్రజా న్యూస్ నెట్వర్క్ :కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని"దుండిగల్ ఏరియా లోని డబల్ బెడ్ రూమ్ లో" సివిల్ కాంటాక్ట్ వర్కర్స్, కిరణ్ మేస్త్రి, షాహేన్సా, సహిల్, ముగ్గురు భవన నిర్మాణ కాంటాక్ట్ సివిల్ కాంటాక్ట్ వర్క్ గత కొన్ని నెలలు నుంచి డబల్ బెడ్ రూమ్ లో సివిల్ కాంటాక్ట్ పని చేసేవారూ... డబల్ బెడ్ రూమ్ లలో ఉన్న ఓనర్ లు పనిచేయించుకొని ఈ ముగ్గురు భవనిర్మాణ కార్మికులకు వేతనం మొత్తం 62,500/- రూపాయలు ఇవ్వాల్సి ఉండగా అవి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడం తో డబల్ బెడ్ రూమ్ లలో ఉన్న ఓనర్ లు నిర్లక్ష్యం వహిస్తూ ఆ వేతనం ఇవ్వకుండా ముగ్గురు కార్మికులను ఇబ్బంది పెట్టేవారు... వేతనం ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు డబుల్ బెడ్ రూములలో ఉన్న ఓనర్లు పని చేయించుకుని వేతనం ఇవ్వకుండా ఎన్నిసార్లు అడిగిన భవన నిర్మాణ సివిల్ కాంటాక్ట్ వర్కర్ ల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన కార్మికులు తమకు తెలిసిన తోటి కార్మికుల ద్వారా మనకు ఎవరైతే న్యాయం చేస్తారో అని తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు..వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన డబల్ బెడ్ రూములలో ఉండే ఓనర్ ల వద్దకు బయలుదేరి వారితో పలుమార్లు చర్చించి ముగ్గురు కార్మికులకు రావాల్సిన వేతనం మొత్తం 62,500/- రూపాయలు ఇప్పించడం జరిగింది... సివిల్ కాంటాక్ట్ భవన నిర్మాణ కార్మికులు మాట్లాడుతూ ఈ రోజుల్లో కూడా కార్మికులకు న్యాయం చేయడం లో ముందుండి ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా ఊరుకునే ప్రసక్తే లేదని, ప్రతి కార్మికునికి న్యాయం చేస్తున్న రవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు...ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు..

మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కృషికి అభినందనలు



మేడ్చల్, అక్టోబర్ 26 ప్రజా న్యూస్ నెట్వర్క్,సంతోష్ కుమార్. : మేడ్చల్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) శంకర్ రెడ్డిని సోమవారం పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ విభాగం వైస్ ప్రెసిడెంట్ గ్యార శ్రీనివాస్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు డాక్టర్ వలిగొండ శ్రీనివాస్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా గౌడ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు బెల్లంకొండ జ్యోతి పాల్గొన్నారు.అనంతరం బాచుపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాయుడును సైతం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ చేస్తున్న కృషిని వారు అభినందించారు.

సమాజ సేవకుడు డా. మునీర్ అహ్మద్ షరీఫ్‌కు అరుదైన గౌరవం

లయన్స్ క్లబ్‌లో సభ్యత్వం.. మరింత పెరిగిన సామాజిక బాధ్యత



మిర్యాలగూడ,ప్రజా న్యూస్ నెట్వర్క్ :
గత 30 ఏళ్లుగా పేద ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ, వివిధ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మన్ననలు పొందుతున్న ప్రముఖ సమాజ సేవకుడు డా. మునీర్ అహ్మద్ షరీఫ్‌కు మరో అరుదైన గౌరవం లభించింది. ఆయన సేవలను గుర్తించిన మిర్యాలగూడ లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆయనకు క్లబ్ సభ్యత్వం కల్పించి అభినందనలు తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాలతో విశిష్ట గుర్తింపు పొందిన లయన్స్ క్లబ్‌లో డా. మునీర్ అహ్మద్ షరీఫ్‌కు సభ్యత్వం లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ కోల సైదులు ముదిరాజ్ ఆయన సేవలను గుర్తించి సభ్యత్వం కల్పించారు.ఈ సందర్భంగా డా. మునీర్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ, తన తల్లిదండ్రుల స్ఫూర్తితో గత 30 ఏళ్లుగా తన పరిధిలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. ప్రజల అభిమానం, ఆశీస్సులు పొందడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. లయన్స్ క్లబ్ తనపై నమ్మకంతో సభ్యత్వం కల్పించి గుర్తింపు ఇవ్వడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు.“సమాజం మనకేం ఇచ్చిందని కాకుండా, సమాజానికి మనమేం చేయగలమనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాను” అని ఆయన అన్నారు.ఈ లక్ష్యంతోనే జనయేత్రీ ఫౌండేషన్‌ను స్థాపించి, రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యుడిగా తన బాధ్యత మరింత పెరిగిందని, ఈ అవకాశాన్ని సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు వినియోగించుకుంటానని పేర్కొన్నారు.తన సేవలను గుర్తించి లయన్స్ క్లబ్ సభ్యత్వం కల్పించిన మిర్యాలగూడ లయన్స్ క్లబ్ ప్రతినిధులకు, సభ్యులందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల్లో బాలల భద్రతపై న్యాయ అవగాహన కార్యక్రమాలు



(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 26 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..
సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య జిల్లాలోని పెద్దాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సదాశివపేట ప్రభుత్వ రవీంద్ర మోడల్ పాఠశాల, ప్రభుత్వ న్యూ హైస్కూల్‌లో విద్యార్థులకు న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, లైంగిక వేధింపుల నివారణ, ఆన్‌లైన్ భద్రత, బాలల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. అనుచిత ప్రవర్తన లేదా అసురక్షిత పరిస్థితులు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు.బాలలకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీమతి బి. సౌజన్య పేర్కొన్నారు.

త్రిపురారం మండల ఉప సర్పంచ్‌ల ఫోరం కమిటీ ఏర్పాటు



త్రిపురారం మండలం అక్టోబర్ 26 ప్రజా న్యూస్ నెట్వర్క్ రిపోర్టర్ గాసిరాశీ
నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలో ఉప సర్పంచ్‌ల ఫోరం మండల కమిటీని ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు గాదె రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో త్రిపురారం మండలానికి చెందిన పలువురు ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ధనావత్ మంగ్త నాయక్, ఉపాధ్యక్షురాలిగా ఎస్‌కే సైదాబీ, కార్యదర్శిగా వల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కార్యదర్శిగా కలకొండ శేఖర్‌ను ఎంపిక చేశారు. రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్ ఆధ్వర్యంలో ఈ నియామకాలు ఏకగ్రీవంగా జరిగినట్లు తెలిపారు.గ్రామాల అభివృద్ధికి ఉప సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేయాలని, గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఉప సర్పంచ్‌లు
లచ్య తండా – ధనావత్ వినోద్ కుమార్,రుప్ల తండా – మంగ్త నాయక్, పలుగుతండా – నాగు నాయక్, కాపువారిగూడెం – స్వామి, కుంకుడుచెట్టు –సర్దార్,డొంక తండా–విజయ్,బడాయి గడ్డ – రామ్ సింగ్ నాయక్,రాగడప –వెంకటేశ్వర్లు, బొర్రాయిపాలెం–కలకొండ శేఖర్,అల్వాల్ పాడ్ – వల్లయ్య, అప్పలమ్మగూడెం –ఎస్‌కే సైదాబీ.
ఈ సమావేశంలో త్రిపురారం మండలానికి చెందిన ఉప సర్పంచ్‌లు పాల్గొని నూతన కమిటీ ఏర్పాటుకు తమ మద్దతు తెలిపారు.

పటేల్ రమేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, పార్టీ కార్యక్రమాలపై ఇరువురి చర్చ
- పట్టభద్రుల ఓటర్ల నమోదు, ఎన్నికల కార్యాచరణపై సమాలోచన



సూర్యాపేట జిల్లా , అక్టోబర్ 26, ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :
ఉమ్మడి నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో పటేల్ రమేష్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ భేటీలో రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల ప్రచార నిర్వహణ, పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ, ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై ఇరువురు చర్చించారు. పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ తరపున చేపట్టాల్సిన కార్యక్రమాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో తాగునీటి సమస్యల పరిష్కారానికి జలమండలి అధికారులతో సమీక్ష

ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



హైదరాబాద్ ఉప్పల్ ప్రతినిధి కె శివ కుమార్ అక్టోబర్ 26 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్):
ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలు, పైప్‌లైన్ లీకేజీలు, కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు, పెండింగ్ పనుల పురోగతి తదితర అంశాలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్న ప్రాంతాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్దిష్ట సమయాల్లో తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.అదేవిధంగా పాత పైప్‌లైన్ల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీల నివారణ, అవసరమైన ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సమీక్షించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరచడంతో పాటు, డ్రైనేజీ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు.ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందించడంలో జలమండలి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

జర్నలిస్టుల హక్కుల కోసం కలం గర్జించాలి.. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటమే మార్గం!

కోదాడలో జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం.. షేక్ అబ్దుల్ రజాక్‌కు ఘన సన్మానం
జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి గౌరవం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ముందడుగు



కోదాడ నియోజకవర్గం, అక్టోబర్ 26, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్:
సమాజంలోని సమస్యలను నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకువచ్చే జర్నలిస్టులు తమ సమస్యల పరిష్కారం కోసం కూడా ఐక్యంగా గళమెత్తాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జర్నలిస్టులకు వృత్తిపరమైన భద్రత, అర్హులకు ప్రభుత్వ గుర్తింపు, సంక్షేమ పథకాల అమలు, ఆరోగ్య పరిరక్షణ, కుటుంబ భద్రత వంటి అంశాలపై సంబంధిత ప్రభుత్వాలు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే జర్నలిస్టుల గొంతుకను బలోపేతం చేయడంతో పాటు, వారి సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాల్సిన బాధ్యత కూడా సమాజం, పాలకులపై ఉందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. జర్నలిజం అంటే కేవలం వార్తలు రాయడం మాత్రమే కాదని, అన్యాయాన్ని ప్రశ్నించడం, బాధితులకు అండగా నిలవడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం, ప్రజల గొంతుకగా పనిచేయడం అని పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కుల విషయంలో రాజీ పడకుండా, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల ఐక్యతే బలం, హక్కుల పరిరక్షణే లక్ష్యం, ప్రజాసేవే జర్నలిజం ధ్యేయం అనే సంకల్పంతో వృత్తి గౌరవాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సమ్మేళనం సందేశాన్నిచ్చింది.

పోలీసు అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి.. రక్తదానంతో ప్రాణదానం!

- సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో భారీ రక్తదాన శిబిరం
- ఎస్పీ నరసింహ ఐపీఎస్ స్వయంగా రక్తదానం.. 150 మందికి పైగా పోలీసు సిబ్బంది, ఆటో యూనియన్ సభ్యుల భాగస్వామ్యం



సూర్యాపేట జిల్లా, అక్టోబర్ 26, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్:
పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలనే సంకల్పంతో సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు ఆటో యూనియన్ సభ్యులు, స్థానిక పౌరులు ఉత్సాహంగా పాల్గొని 150 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రమాదాల్లో గాయపడినవారికి, అత్యవసర వైద్యం అవసరమైన రోగులకు సకాలంలో రక్తం అందక ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. అలాంటి పరిస్థితులను నివారించేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల త్యాగాలకు గుర్తుగా ఈ శిబిరాన్ని నిర్వహించామని, ప్రజాసేవలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఖమ్మంకు చెందిన తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ ప్రతినిధులు తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు ఉపయోగపడేలా రక్తాన్ని సేకరించారు. యువత పెద్ద సంఖ్యలో రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం కూడా పోలీసుల సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు నరసింహాచారి, రవి, పలువురు సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీసు సంఘం నాయకులు, సిబ్బంది, ఆటో యూనియన్ సభ్యులు, స్థానిక పౌరులు పాల్గొన్నారు.

మఠంపల్లి ప్రజావాణికి అధికారుల గైర్హాజరు.. ప్రజల సమస్యలు వినేదెవరు?


ఉదయం 11:15 దాటినా పలుశాఖల అధికారులు రాకపోవడంపై ప్రజల అసంతృప్తి
సమయపాలన పాటించి ప్రజావాణి లక్ష్యాన్ని నెరవేర్చాలని డిమాండ్



మఠంపల్లి మండలం, అక్టోబర్ 26, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్:
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మఠంపల్లి మండలంలో నిర్వహించిన ప్రజావాణికి సూపరింటెండెంట్ విజయలక్ష్మి మాత్రమే హాజరయ్యారని, ఉదయం 11:15 గంటలు దాటినా ఇతర శాఖల అధికారులు రాకపోవడంతో తమ సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజలు నిరీక్షించాల్సి వచ్చిందని స్థానికులు పేర్కొన్నారు. వివిధ గ్రామాల నుంచి ఆశతో మండల కేంద్రానికి వచ్చిన ప్రజలకు సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల ఫిర్యాదులు ఎవరికి అందజేయాలనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు నిర్దిష్ట సమయానికి హాజరై ఫిర్యాదులను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించి, అధికారుల గైర్హాజరుపై విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ నాయక్ విజ్ఞప్తి చేశారు.

ఉప్పల్‌లో ఘనంగా శ్రీ బొడ్రాయి (నాభిశిల) 12వ వార్షికోత్సవ పుష్కర మహోత్సవాలు

యజ్ఞయాగాలు, చండీ హోమం, మహాకుంభాభిషేకం, బోనాలు, అన్నదాన కార్యక్రమాలు
భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు, పట్టణ ప్రముఖులు





హైదరాబాద్ ఉప్పల్ ప్రతినిధి కె శివ కుమార్ అక్టోబర్ 26 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్): ఉప్పల్ ప్రాంతంలో శ్రీ బొడ్రాయి (నాభిశిల) 12వ వార్షికోత్సవ పుష్కర మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పవిత్ర ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఉప్పల్ ప్రాంతమంతా భక్తిమయంగా మారింది. గ్రామదేవతగా పూజలందుకుంటున్న శ్రీ బొడ్రాయి నాభిశిలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ, ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, కుటుంబాల అభివృద్ధి, ప్రాంత శ్రేయస్సు కోసం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ యజ్ఞయాగాలు, విశేష హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించి, లోకకల్యాణం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేదమంత్రాల పఠనం, మంగళవాయిద్యాల నడుమ జరిగిన పూజా కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తాయి. మహాకుంభాభిషేక కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పవిత్ర జలాలతో అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందించాలని భక్తులు ప్రార్థించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు.ఉత్సవాల్లో భాగంగా మహిళలు, భక్తులు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. పసుపు, కుంకుమ, పూలతో అలంకరించిన బోనాలను సమర్పిస్తూ అమ్మవారిని పూజించారు. కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పిల్లాపాపలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ఉప్పల్ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.మహోత్సవాలను పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు సేవ చేయడం, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం గొప్ప అదృష్టమని పలువురు పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమం ద్వారా సేవాభావం, సోదరభావం, ఐకమత్యం వెల్లివిరిశాయి.పాల్గొన్న పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు శ్రీ బొడ్రాయి నాభిశిల 12వ వార్షికోత్సవ పుష్కర మహోత్సవాల్లో స్థానిక పెద్దలు, పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని ప్రజలందరికీ శుభం కలగాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాల ప్రాముఖ్యతను పలువురు వివరించారు. ఇలాంటి పండుగలు మన సంప్రదాయాలను, సంస్కృతిని భావితరాలకు అందించడంతోపాటు ప్రజల మధ్య ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.శ్రీ బొడ్రాయి నాభిశిల అమ్మవారి ఆశీస్సులతో ఉప్పల్ ప్రాంత ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని, వ్యాపారాలు అభివృద్ధి చెందాలని, యువతకు మంచి అవకాశాలు లభించాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని భక్తులు ప్రత్యేకంగా ప్రార్థించారు. సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ ఇలాంటి ఉత్సవాలను ఐకమత్యంతో నిర్వహించడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.శ్రీ బొడ్రాయి నాభిశిల 12వ వార్షికోత్సవ పుష్కర మహోత్సవాలు భక్తి, సంప్రదాయం, సేవాభావం, సామాజిక ఐకమత్యానికి ప్రతీకగా నిలిచాయి ఈ ఉత్సవ కార్యక్రమాలు 23,24,25 తేదీలు మూడు రోజులపాటు ఘనంగా జరిగాయి.

పటేల్ రమేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, పార్టీ కార్యక్రమాలపై ఇరువురి చర్చ
- పట్టభద్రుల ఓటర్ల నమోదు, ఎన్నికల కార్యాచరణపై సమాలోచన

సూర్యాపేట జిల్లా , అక్టోబర్ 26, ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :
ఉమ్మడి నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో పటేల్ రమేష్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ భేటీలో రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల ప్రచార నిర్వహణ, పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ, ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై ఇరువురు చర్చించారు. పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ తరపున చేపట్టాల్సిన కార్యక్రమాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

తునిలో వైకాపా అభ్యర్థుల తరఫున మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ప్రచారం

17, 18 వార్డుల్లో అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారం.. ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లకు విజ్ఞప్తి



తుని, అక్టోబర్ 26 ప్రజా న్యూస్ నెట్‌వర్క్:
తుని పురపాలక సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సోమవారం 17, 18 వార్డుల్లో పర్యటించారు. ఆయా వార్డుల అభ్యర్థులతో కలిసి ఓటర్లను కలుస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి పిట్ల రామతులసి, 17వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కన్నూరి శ్రీనివాస్, 18వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిని అల్లాడ మహేశ్వరిని ఓటర్లకు పరిచయం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వారిని గెలిపించాలని దాడిశెట్టి రాజా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుని పురపాలక సంఘం ఎన్నికల ప్రచారానికి ప్రతి వార్డులోనూ ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. వైకాపా బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే తుని పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఇంటింటి ప్రచారంలో పాల్గొంటున్న దాడిశెట్టి రాజాకు మహిళలు హారతులతో స్వాగతం పలుకుతున్నారు. స్థానికులు ఆప్యాయంగా పలకరిస్తూ తమ అభిమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు చూపిస్తున్న ఆదరణ పట్ల దాడిశెట్టి రాజా కృతజ్ఞతలు తెలిపారు.

తునిలో 29, 24వ వార్డుల్లో కూటమి అభ్యర్థుల ప్రచారం

ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలు.. సైకిల్, గాజు గ్లాస్ గుర్తులపై ఓటు వేయాలని కోరారు.





తుని, అక్టోబర్ 26 ప్రజా న్యూస్ నెట్‌వర్క్:
తుని పట్టణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 29, 24వ వార్డుల్లో కూటమి అభ్యర్థులు, నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిని ఎస్. శ్రీలత, 29వ వార్డు నుంచి కూటమి బలపరిచిన టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి సిద్ధాంతపు చంద్రకళ, 24వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ అభ్యర్థి పదిలం వెంకట రాజుబాబు కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, జనసేన పార్టీ నాయకులు యనమల కృష్ణుడు, బార్లపూడి క్రాంతి, తుని నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చోడిశెట్టి గణేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రచారంలో భాగంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గాజు గ్లాస్, సైకిల్ గుర్తులపై ఓటు వేసి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

తునిలో కూటమి అభ్యర్థుల తరఫున యనమల దివ్య ప్రచారం

5, 6, 7వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం.. అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటర్లకు విజ్ఞప్తి





తుని, అక్టోబర్ 26 ప్రజా న్యూస్ నెట్‌వర్క్:
తుని మున్సిపాలిటీలో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రభుత్వ విప్ యనమల దివ్య ప్రచారాన్ని విస్తృతం చేశారు. రోడ్‌షోలు, ఇంటింటి పర్యటనల ద్వారా ఓటర్లను నేరుగా కలుస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రచారంలో భాగంగా ఈరోజు 5, 6, 7వ వార్డుల్లో యనమల దివ్య పర్యటించారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, సీనియర్ నాయకులు యనమల రాజేష్, చింతనీడి అబ్బాయి, యినుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, మోతుకూరి వెంకటేష్, సూరంపూడి చంద్రశేఖర్, చోడిశెట్టి త్రిమూర్తి స్వామి, కుండల రామకృష్ణ, పరవాడ తాతబాబు తదితరులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తన హయాంలో ఆయా వార్డుల్లో జరిగిన అభివృద్ధిని కూడా తెలియజేశారు.కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి శ్రీలత, వార్డు అభ్యర్థులు గూడాల ఆనంద్, గుడివాడ అప్పలనాయుడు, రంగాల వెంకట లక్ష్మి, సీనియర్ నాయకుడు సూరిశెట్టి కృష్ణతో పాటు స్థానిక నాయకులు లంక సునీల్, అల్లు రాజు, చొప్పా సత్యనారాయణ, పాలిక శ్రీను, రంగాల గోవిందు, దండెం నాగు తదితరులు పాల్గొన్నారు.

యనమల రామకృష్ణుడిని పరామర్శించిన దేవినేని ఉమా

కాకినాడలో చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న మాజీ ఆర్థిక మంత్రి ఆరోగ్య పరిస్థితిపై ఆరా

తుని, అక్టోబర్ 26 ప్రజా న్యూస్ నెట్‌వర్క్:
గుండె సంబంధిత సమస్యతో కాకినాడలో చికిత్స పొందిన మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడిని పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఆసుపత్రిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను మాజీ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, మాజీ చైర్మన్ గన్ని కృష్ణ తదితరులు యనమల రామకృష్ణుడిని పరామర్శించారు.



దుమాల గ్రామంలో మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డ దొంగలు

గ్రామస్తుల్లో ఆందోళన!

తాళాలు పగులగొట్టి దొంగల బీభత్సం-రంగంలోకి దిగిన పోలీసులు.










ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 26 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసి ఉన్న మూడు ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. ఇళ్లలో ఎవరూ లేని సమయాన్ని అదునుగా చేసుకున్న దుండగులు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి దొంగతనాలకు పాల్పడినట్లు తెలుస్తోంది.ఒకే గ్రామంలో మూడు ఇళ్లలో చోరీలు జరగడంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. తమ ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పోలీసుల నిఘా పెంచి, రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని కోరుతున్నారు.మూడు ఇళ్లలో చోరీ జరిగిందన్న సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మూడు ఇళ్లలో ఏయే వస్తువులు చోరీకి గురయ్యాయి, ఎంతమేర ఆస్తి నష్టం వాటిల్లిందనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ చోరీలకు పాల్పడిన దుండగులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

‘ఏఐ కాలం’ ఎదగాలంటే ప్రశ్నించాల్సిందే!



ఇప్పటి వరకు చదువంటే ప్రస్తుతకాల్లోని విషయాలను బాగా గుర్తుపెట్టుకుని, పరీక్షల్లో రాసి, మంచి మార్కులు తెచ్చుకోవడమేనని భావించాం. కానీ, ఈ పద్ధతి ఎంతమాత్రం సరికాదనేవారు ప్రఖ్యాత తత్వవేత్త జిద్దు కృష్ణమూర్తి. ‘నిజమైన మేధస్సు అంటే ఎక్కువ సమాచారాన్ని కలిగి ఉండటం కాదు; గమనించడం, ప్రశ్నించడం, ఆలోచించడం, స్వయంగా తెలుసుకోవడమే’ అని చెప్పేవారాయన. నేడు దానికి ఎనలేని ప్రాధాన్యం లభిస్తోంది, ముఖ్యంగా ఉద్యోగార్థులకు సొంతంగా ఆలోచించి, తెలుసుకునే సామర్థ్యం అత్యావశ్యకమవుతోంది. దీంతో అధ్యాపకులు మరింత క్రియాశీలకంగా ఎలా ఉండాలి? ఆలోచించి, విషయాలను తెలుసుకునే సామర్థ్యాన్ని విద్యార్థుల్లో ఎలా పెంపొందించాలి? అన్నవి కీలకంగా మారాయి. సమాచారాన్ని సేకరించి, అందించే పనిని ఏఐ చాలా సమర్థంగా, చిటికెలో చేసిపెడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులు కేవలం సమాచారాన్ని అందించే వ్యక్తులుగా మిగిలిపోకూడదు. విద్యార్థుల్లో ఆలోచననూ, ప్రశ్నించే తత్వాన్నీ, అన్వేషణనూ మెరుగుపరిచే మార్గదర్శిగా మారాలి. ఇందుకోసం కొన్ని ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉంది. నేటి కాలంలో బోధన ప్రధాన లక్ష్యం విద్యార్థుల స్వీయ అభ్యాసన సామర్థ్యాన్ని పెంపొందించడమే. ఆలోచించి, పరిష్కరించగలిగే సమస్యలను అప్పగించడం ద్వారా వారిలో నేర్చుకునే స్వభావాన్నీ నైపుణ్యాన్నీ ఇనుమడింప చేయవచ్చు. నిరంతరం కొత్త విషయాలు నేర్చుకునే జిజ్ఞాస, సామర్థ్యం ఉన్నవారిని ఉద్యోగులుగా నియమించుకోవడానికి నేడు ఎన్నో కంపెనీలు ఎదురు చూస్తున్నాయి. నేర్చుకునే సామర్థ్యమే అసలైన నైపుణ్యం. మా వేట అంతా అలాంటివారి కోసమేనని గూగుల్ మాజీ సీఈవో ఎరిక్ స్మిత్ పేర్కొనడాన్ని ఇక్కడ గమనించాలి. కాబట్టి ఉపాధ్యాయులు ప్రాథమిక అంశాల బోధన, సాంకేతిక నైపుణ్యాలను అందించడానికే పరిమితం కాకుండా... విద్యార్థుల్లో స్వీయ అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించాలి. ఇందుకోసం వారికి సవాళ్లతో కూడిన అసైన్‌మెంట్లను అప్పగించాలి. వాటిని సాధించే క్రమంలో ఎదురయ్యే అడ్డంకులను ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి పరిష్కరించాలి.

నిర్మాణాత్మక సంభాషణ కీలకం

ఉపాధ్యాయులు ముందుగా తమ విద్యార్థులను లోతుగా అర్థం చేసుకోవాలి. ఇందుకు సహానుభూతి, స్వీయ అవగాహన తప్పనిసరి. ఇతరులకు ఒక విషయాన్ని అర్థమయ్యేలా విడమరిచి చెప్పే బాధ్యత మనపై ఉన్నప్పుడు... నిరంతరం మనల్ని మనం ప్రశ్నించుకుని, విషయాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవడానికి ఉపక్రమిస్తాం. అటువంటి నిరంతర అభ్యాసమే క్రమశిక్షణగా మారుతుంది. ఆధునిక యుగంలో ఆలోచనా శక్తిని పెంపొందించుకోవడానికి ‘నిర్మాణాత్మక సంభాషణ’ ఒక ఆచరణాత్మక మార్గం కాగలదు. తరగతి గదిలో ఉపన్యాసం ఇవ్వడం కంటే, ఒక ఆసక్తికరమైన ప్రశ్నతో చర్చను ప్రారంభించి విద్యార్థులను ఆలోచింపజేయడం మరింత ప్రభావవంతంగా ఉంటుంది. ఇక్కడ ఉపాధ్యాయుడు- విద్యార్థి అనే హెచ్చుతగ్గులు లేకుండా, అందరూ కలిసి అన్వేషించే వాతావరణం అవసరం. ఉదాహరణకు, బీ2బీ(వ్యాపారి నుంచి వ్యాపారి) మార్కెటింగ్ క్లాస్‌లో ‘పీఅండ్‌జీకి అతిపెద్ద కస్టమర్ ఎవరు?’ అనే ప్రశ్నతో సంభాషణను మొదలుపెట్టవచ్చు. దానికి చాలామంది విద్యార్థులు ఫలానా వ్యక్తి అని చెబుతారు. నిజానికి పీఅండ్‌జీ ఒక బీ2సీ(వ్యాపారి నుంచి వినియోగదారుడు) కంపెనీ, దానికి అతిపెద్ద కస్టమర్ వాల్‌మార్ట్ సంస్థ. పీఅండ్‌జీ రాబడిలో 15శాతం వాల్‌మార్ట్ నుంచే వస్తుంది. మొత్తం మార్కెటింగ్‌లో బీబీ వ్యవస్థ చాలా కీలకమైనది. పైకి కనిపించేదానికన్నా అధికంగా జీవితాలను ప్రభావితం చేస్తుందది. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నిజాయతీగా అన్వేషణ సాగించినప్పుడే అభ్యాసం భేషుగ్గా జరుగుతుందని కృష్ణమూర్తి చెప్పేవారు. కాబట్టి అభ్యాసం అంటే కేవలం సమాచార బదిలీ కాదు- అది అన్వేషించడం, ప్రశ్నించడం, తెలుసుకోవడం వంటివాటితో కూడిన ఉమ్మడి ప్రక్రియ. చదువుల ప్రధాన లక్ష్యం టెస్ట్‌లో మంచి మార్కులు సాధించేలా, ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను తయారు చేయడం కాదు. మంచి ప్రశ్నలు అడిగే, లోతుగా ఆలోచించే, జిజ్ఞాస కలిగిన పరిపూర్ణ వ్యక్తులుగా విద్యార్థులను తీర్చిదిద్దడం. ఇప్పటికే అమలవుతున్న పద్ధతులకు అనుగుణంగా వ్యక్తులను తయారుచేస్తే విద్య విఫలమవుతుందని జిద్దు కృష్ణమూర్తి వాదించారు, చదువుల అంతిమ లక్ష్యం మనిషిని సంపూర్ణ మానవుడిగా అభివృద్ధి చేయడమేనని స్పష్టం చేశారు. కాబట్టి, నేటి కాలంలో ఉపాధ్యాయులు విద్యార్థుల్లో జిజ్ఞాసనూ, ఆలోచించే నైపుణ్యాన్నీ పెంపొందించడంపై దృష్టి కేంద్రీకరించాలి. ప్రశ్నించి తెలుసుకోవాలనే కుతూహలాన్ని వారిలో వృద్ధి చెయ్యాలి.

విమర్శనాత్మక ఆలోచనకు...

మంచి ప్రశ్నలు అడిగేలా విద్యార్థులను ప్రోత్సహించాలి. ఎందుకంటే, ఏఐ కాలంలో ఇదే వారిని ప్రత్యేకంగా నిలుపుతుంది. విద్యార్థులను ఉద్యోగాల కోసం కాకుండా, సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా తీర్చిదిద్దడం ముఖ్యం. సమాజంలో వారికి ఎదురయ్యే ప్రతి సమస్యకూ, తదనుగుణమైన సమాధానం దక్కేలా చేయాలి. తద్వారా వారిలో సానుకూల దృక్పథం, ఆత్మవిశ్వాసం, పట్టుదల, సమస్యా పరిష్కార సామర్థ్యం పెరుగుతాయి. సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా, ఉద్యోగ నైపుణ్యాలతో పాటు నిత్యం మార్పుచెందుతున్న నవీన సాంకేతికతలను అందిపుచ్చుకునేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి. ఇందుకు ఏఐ ద్వారా కార్టూన్లు, ప్రశ్నలు వంటివి రూపొందించి విద్యార్థుల్లో ఆసక్తిని పెంచవచ్చు. హార్వర్డ్ యూనివర్సిటీ ‘బిజినెస్ కార్టూన్లతో కోర్సు భావనలకు జీవం పోయండి’ శీర్షికన ఒక వ్యాసాన్ని ప్రచురించింది. దాని ప్రకారం, ఏఐ రూపొందించిన కార్టూన్లు తరగతి గదిలో చర్చా సాధనాలుగా మారి విద్యార్థుల భాగస్వామ్యాన్ని జ్ఞాపకశక్తినీ పెంచుతాయి. వారిని విమర్శనాత్మకంగా ఆలోచించేలా ప్రోత్సహించి, కోర్సు భావనలతో ఆచరణాత్మకంగా అనుసంధానిస్తాయి. తరగతి గదిలో సుహృద్భావ వాతావరణం ఉంటే, విద్యార్థులు మరింత చురుగ్గా నేర్చుకోగలుగుతారు. కాబట్టి, ఏఐ యుగంలో ఉపాధ్యాయుల పాత్ర ‘ఆలోచించే ప్రక్రియను పెంపొందించడం’ వైపు మళ్లాలి. విద్యార్థులను మంచి ప్రశ్నలు అడిగేలా, స్వీయ నిర్ణయాలు తీసుకునేలా, జీవితాంతం నేర్చుకునేలా ప్రోత్సహించాలి. ఇవే నేటి చదువుల ప్రధాన లక్ష్యాలు కావాలి.

కథా సంవేదన: ఫోన్ అన్‌బ్లాక్.. బంధాలు అన్‌బ్లాక్



ఆ రోజు శనివారం. సునీతతో పాటు ఆమె కూతురు కూడా ఛాంబర్‌లోకి వచ్చింది. ఎనిమిదేళ్ల ఉంటాయేమో, పాప అందంగా ఉంది, చురుకుగా అనిపించింది. భార్యాభర్తలిద్దరితో సయోధ్య కుదర్చడానికి రమ్మ న్నాను. ఇద్దరితో ఆ రోజు మాట్లాడాలని అనుకున్నాను. కానీ ఆమె భర్త రాలేదని బెంచ్ క్లర్క్ చెప్పాడు. అందుకని సునీతతోనైనా మాట్లాడాలని అనుకున్నాను. ఆమెను కూర్చోమని చెప్పాను. విడాకుల కేసు గురించి ఆమె అభిప్రాయం అడిగాను. విడిపోవడానికి కారణం కూడా అడిగాను. ఆమె చెప్పే విషయాలు కోర్టు రికార్డులోకి ఎక్కవని, కేసుకు ఏమీ అవ్వదని ఆమెకు చెప్పాను. ఆ తర్వాత ఆమె చెప్పడం ప్రారంభించింది. తరచూ స్నేహితులను తీసుకువచ్చి మందు తాగే వాడని, తనకది నచ్చేది కాదని , ఒక రోజు అతను స్నేహితులతో కలిసి తాగుతుంటే తాను ఘర్షణ పడి, రెండేళ్ల పాపని తీసుకొని ఆ రోజు రాత్రే బయటకు వచ్చేసానని, ఆ తర్వాత ఇద్దరి మధ్య బాగా గ్యాప్ వచ్చిందని కూడా చెప్పింది. తనకి విడాకులు అవసరం లేదని, అతనితో కలిసి జీవించాలని ఉందని ఆమె చెప్పింది. అతని కథనం విన్న తర్వాత ఇద్దరితో మాట్లాడతానని చెప్పాను. అతను రాలేదు కాబట్టి సునీత కేసుని వాయిదా వేశాను. వాళ్లు బయటకు వెళ్లే ముందు ఒక్క నిమిషం నాతో మాట్లాడాలని ఆమె కూతురు అడిగింది. ఆ ప్రశ్న నాకే కాదు, సునీతకు కూడా ఆశ్చర్యం కలిగించింది. చెప్పమని ఆ పాపతో అన్నాను. ‘మా అమ్మ నెంబర్‌ని మా నాన్న బ్లాక్ చేశాడు. నాన్నతో ఎప్పుడైనా మాట్లాడదామని నాకు ఉంటుంది, కానీ ఫోన్ కలవదు. మా స్కూల్‌కి అందరిని నాన్నలు వస్తారు, ఒక్క మా నాన్న తప్ప. అందుకని ఒకసారి నేను మా నాన్నతో మాట్లాడాలని ఉంది. మా అమ్మ నెంబర్‌ని అన్ బ్లాక్ చేయమని చెప్పండి ప్లీజ్!’ అంది ఆ అమ్మాయి. మీ నాన్నకు చెప్పి అమ్మ నంబర్‌ని అన్ బ్లాక్ చేయిస్తాను అని ఆ పాపకి అనునయంగా చెప్పాను. ఆ తర్వాత వాళ్ళిద్దరూ వెళ్లిపోయారు. ఆ తర్వాత సునీత భర్త వచ్చాడని బెంచ్ క్లర్క్ చెప్పాడు. లోపలికి పంపించమన్నాను. అతను వచ్చాడు, అతన్ని కూర్చోమని చెప్పాను. అతను ఎందుకు విడాకులు కోరుకుంటున్నాడో అడిగాను. అతని దరఖాస్తులో ఉన్న విషయాలను అతను ఏకరువు పెడుతుంటే.. అవి కాదు నిజం చెప్పండి, మీరు చెప్పేవి ఏవీ రికార్డులోకి వెళ్ళవు, ఆ విషయాలు మీ కేసును ప్రభావితం చెయ్యవని సునీతకు చెప్పినట్టు అయినకూ చెప్పాను. అప్పుడు అతను తన స్నేహితుల ముందు పార్టీల విషయం చెప్పాడు. ఆ రోజు వాళ్ళ ముందు జరిగిన విషయం చెప్పాడు. సునీత ప్రవర్తన గురించి కూడా చెప్పాడు. ఆమె ప్రవర్తన తనని బాగా హార్ట్ చేసిందని, ఆమెతో కలిసి జీవించడం సాధ్యం కాదని చెప్పాడు. అతన్ని కన్విన్స్ చేయడానికి కొంత ప్రయత్నం చేశాను, కానీ అది ఒక్క సిట్టింగ్‌లో సాధ్యం కాదని అనిపించింది. అతని కూతురు గురించి ఆలోచించమని చెప్పాను, అయినా అతను మెత్తబడలేదు. ఆమె ఫోన్ ఎందుకు బ్లాక్ చేశావని అతన్ని అడిగాను. తన కన్నా ముందే ఆమె తన నెంబర్ బ్లాక్ చేసిందని చెప్పాడు, అందుకే తనూ బ్లాక్ చేశానని చెప్పాడు. ‘ఇప్పుడు అన్ బ్లాక్ చెయ్యండి. ఆమె కూడా మీ నెంబర్ అన్ బ్లాక్ చేసిందని’ చెప్పాను. ‘నేను మాట్లాడదలచుకోలేదు సర్! అలాంటప్పుడు అన్ బ్లాక్ చేసి ఏం ప్రయోజనం’అన్నాడు. ‘మీరు ఆమెతో మాట్లాడాల్సిన అవసరం లేదు. కానీ మీ ఫోన్ అన్ బ్లాక్ చేస్తే చాలు’ అని అతనికి చెప్పాను. కష్టంగా ఒప్పుకున్నాడు. అతను వెళ్ళిపోయిన తర్వాత అదే విషయం సునీతకు చెప్పమని బెంచ్ క్లర్క్‌కి చెప్పాను. బెంచ్ క్లర్క్ ఆమెకు చెప్పాడు. అప్పటికే అతను అన్ బ్లాక్ చేశాడట. ఆ విషయం తెలిసి పాప చాలా సంతోషపడిందని కూడా చెప్పాడు. ఒక కేసు తర్వాత మరో కేసు, సునీత విషయం నా స్మృతి పదం నుంచి పోయింది. సునీత కేసు మర్నాడు ఉందని బెంచ్ క్లర్క్ చెప్పినప్పుడు ఆ జంట గురించి అడిగాను. అతని కూతురు ఫోన్ చేస్తే మొదట అతను లిఫ్ట్ చేయలేదట, అందుకని ఆ పాప వాయిస్ మెసేజ్‌లు పంపడం మొదలుపెట్టిందట. ఈ విషయాలు బెంచ్ క్లర్క్ చెప్పాడు. కేసు ఉన్న రోజు సునీత కోర్టుకు రాలేదు, ఆమె భర్త కూడా రాలేదు. కేసు మరో తేదీకి వాయిదా పడింది. ఆ రోజు కూడా ఇద్దరూ రాలేదు. ఆ పాప ఏం మాయ చేసిందో ఏమో తెలియదు కానీ ఆమె ప్రేమలో తండ్రి పడిపోయాడని, ఆ పాప తరచూ తండ్రి దగ్గరకు వెళుతుందని, అతను కూడా ఆమె స్కూల్‌కి వెళ్తున్నాడని బెంచ్ క్లర్క్ తనకు తెలిసిన సమాచారాన్ని నాకు చెప్పాడు. సంతోషం వేసింది. ఆరు నెలలు గడిచాయి. ఓ శనివారం రోజున వాళ్ళ కేసు తేదీ ఉన్న రోజు ముగ్గురు కోర్టుకు వచ్చారు. ఛాంబర్‌లోకి వచ్చారు. పాప ముఖంలో వెలుగు కనిపించింది. ఒకవైపు తండ్రి చేయి పట్టుకొని, మరోవైపు తల్లి చేయి పట్టుకొని ఆమె నా ఛాంబర్‌లోకి వచ్చింది. ఛాంబర్‌లోకి రాగానే భార్యాభర్తలిద్దరూ నమస్కారం చేశారు. ఆ తర్వాత వాళ్లు మళ్లీ కోర్టుకి రావాల్సిన అవసరం కలగలేదు. ఫోన్‌ని అన్ బ్లాక్ చేయడం వాళ్ల జీవితాన్ని మార్చిందా, ఆ పాప మాటలు వారి జీవన ప్రయాణానికి మార్గం సుగమం చేసిందా? లేక అవి రెండు చేశాయా అన్న ఆలోచనల్లో పడ్డాను. ఒక్క అన్ బ్లాక్ వాళ్ళ జీవితంలో బ్లాక్స్ లేకుండా చేసింది.

అన్నదాత పట్ల కృతఘ్నతా సమాజం!



కనిపెంచిన అమ్మనాన్నలనే నిర్దాక్షిణ్యంగా అనాథాశ్రమాల్లో పడేస్తున్న సమాజంలో కర్కశంగా బతికేయడం మనకు తరతరాలుగా అలవాటైపోయింది. ఇక ఎవరో ఒక అధికారి ఎక్కడో ఒక రైతుని ‘పురుగుల మందు తాగి ఇంకా చావలేదా?’ అని ప్రశ్నిస్తే (గజ్వేల్ తహసీల్దార్ ఘటన), మన తోలు మందం జీవితాలు ఎందుకు స్పందిస్తాయి? రోజూ అన్నం తినే ముందు చేతిలోకి ఆ ముద్ద ఎక్కడి నుంచి వచ్చిందని గుండెల మీద చెయ్యేసి ప్రశ్నించుకుంటే రైతుకి ఈ కష్టం వచ్చేదా? కవితల్లో, కథా రచనల్లో ఉపన్యాసాల్లో రైతులను అన్నదాతలని, రైతన్న అంటూ దాతగా, అన్నగా ఆకాశానికి ఎత్తేస్తాం కానీ, వారి జీవితాలు సమస్యల్లోకి జారిపోతుంటే చేతులు అడ్డంపెట్టి కాపాడని కృతఘ్నులు ఎవరు? కచ్చితంగా మనమే.. బతికున్నంతకాలం మన ఆకలి తీర్చేందుకు రైతులు అవమానాలతో సమస్యల మధ్య రగిలిపోతూ బలవన్మరణాలకు సైతం పాల్పడుతున్నారంటే చూస్తూ ఊరుకుంటున్న మనం నరరూప రాక్షసులం కాదా? మనలో ఉన్నవి ఉక్కు మనసులు కావా?

మనలో మానవత్వం ఉందా?

రైతు సమస్యలు అనగానే, ప్రభుత్వాలేం చేస్తున్నాయి? అంటూ మనలో చాలామంది సర్కారుని కడిగేయడానికి సిద్ధంగా ఉంటారు. ప్రభుత్వాల వైఖరిని ప్రశ్నించేవారు రకరకాల మార్గాల ద్వారా ఆ పని చేస్తున్నప్పటికీ, రైతు పట్ల ముందుగా స్పందించి తోడై నిలబడాల్సిన తోటి సమాజం ఆ బాధ్యతను నెరవేర్చుతోందా? మన తిండి కోసం విత్తనాలు, ఎరువులకని మలమల మాడ్చే ఎండల్లో రైతులు రోజుల తరబడి సొమ్మసిల్లి పోతున్నా మనలో జాలి కలగదు. ఇది చాలక నకిలీ విత్తనాలు అంటగట్టి వారిని దోచుకునే వ్యాపారులది మరో చరిత్ర. ఆ పైన అప్పులు, వడ్డీల భారం సరేసరి. న్యాయం కోసం రైతులు నిరసనలు చేస్తూ దాదుల్లో చావుదెబ్బలు తింటున్నా సరే, మన ఉక్కు మనసు కరగనే కరగదు. రక్తం చిందిస్తూ పండించిన పంటకు కనీస ధర రాక ఆ ఫలసాయాన్ని రైతులు పార బోస్తుంటే ఎగబడి ఊరికే ఎత్తుకుపోతాం తప్ప పిసరంత సాయం చెయ్యం. రైతు కష్టాన్ని నిస్సిగ్గుగా మనం దోచుకుంటున్నప్పుడు ‘దొంగా..‘ అని మన ఆత్మ నిందిస్తున్నా లెక్క చెయ్యం.

అన్నదాతకు అడుగడుగునా అవమానాలే!

మన మనస్తత్వం ఎలాంటిదంటే, రైతుల దగ్గర గీచి గీచి బేరం చేస్తాం.. కార్పొరేట్ మాల్స్‌లో మాత్రం సైలెంట్‌గా అడిగినంత ఇచ్చేసి కొంటాం. సినీ సెలబ్రిటీలు, క్రికెటర్ల కోసం వద్దన్నా సత్కారాలు, బర్త్‌డేలు, రక్తదానాలు చేస్తుంటాం. సినిమాల్లోని ఆ పాత్రల లైఫ్ స్టయిల్‌ని అనుకరించే ప్రయత్నం చేస్తాం. ఆ మధ్య వ్యవసాయం ప్రధానాంశంగా ‘శ్రీమంతుడు’ అనే సినిమా వచ్చినప్పుడు ఐటీ ఉద్యోగులు చాలామంది వీకెండ్ వ్యవసాయం అని హడావుడి చేశారు. తర్వాత అంతా గప్‌చుప్. ఇక రైతులు, వ్యవసాయం గురించి నేటి బాలలకున్న అవగాహన చూస్తే ‘బియ్యం ఏ చెట్టుకి కాస్తుంది?’ అని ప్రశ్నించే దుస్థితి నెలకొంది. మనల్ని కాపాడుతున్న రైతుకు మనమిస్తున్న గౌరవమేంటని ప్రశ్నించుకుంటే సిగ్గుతో తలదించుకునే పరిస్థితి నెలకొంది. రైతు కుటుంబాల్లోకి తమ ఆడపిల్లను కోడలిగా పంపడానికి నేడు సమాజం సిద్ధంగా లేదు. ఏ గౌరవమూ లేని వ్యవసాయంలోకి యువత రావ ల్లేదు. ఇదే తీరు భవిష్యత్తులో కొనసాగితే మన పరిస్థితి ఏమిటన్న ఆలోచనే చెయ్యని క్రూర సమాజంలో ఉన్నాం.

సమాజం చేయూత అందించాలి!

దేశంలో రైతుల ఆత్మహత్యలు ఎన్నో జరిగాయి. ఆర్థికంగా చితికిపోతున్నారు. వీరికి కొన్ని స్వచ్ఛంద సంస్థలు కాస్తోకూస్తో సాయం చేస్తున్నప్పటికీ, సమాజం చేయూత లేకుంటే ఈ సాయం కొనసాగదు.. మరోవైపు ఎల్‌నినో పరిస్థితులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఇప్పటికైనా మేలుకుని రైతులను, వ్యవసాయాన్ని కాపాడుకోవడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకుంటే ముప్పుందు ఊహించలేని పరిణామాలు తప్పవు.. ఈ పరిస్థితుల్లోనే రైతులను కాపాడుకోవాలి. మన వాణిజ్య, పారిశ్రామిక, ఐటీ రంగాలు గతంతో పోల్చి చూస్తే, నేడు చాలా వృద్ధి చెందాయి కానీ ఎవరు ఏ స్థాయికి ఎదిగినా రైతు లేకపోతే అందరిదీ అథోగతే.. ఇది గు